


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



- 135 -

## తోడు-నీడ

**చిన్నప్పటినుండీ ఆకాశంలో** ఎగిరే విమానాన్ని చూస్తూ రవి ఎన్నో కలలు కనేవాడు. ఏదో ఒకరోజు ఆ విమానంలో కూర్చుని విదేశీయానం చెయ్యాలని బాల్యంలోనే నిశ్చయించుకున్నాడు.

ఆ తరువాత తండ్రి పక్షవాతంతో మంచాన పడటంతో ఆ దిగులుతో ఇంటర్ లో ఒక సబ్జెక్ట్ పోయి ఫెయిల్ అవడంతో ఇక చదువు మీద విరక్తి వచ్చింది.

ఇక కువైట్ వెళ్ళి కుటుంబాన్ని ఆదుకోవడం తన ధర్మమని భావించి తన స్నేహితులకు ఫోన్ చేసి వీసా పంపమని అర్థించాడు.

కష్టాల ఊబిలో కూరుకుపోతున్న కుటుంబాన్ని గట్టెక్కించాలంటే, తండ్రి అనారోగ్యానికి చేసిన అప్పులు తీరాలంటే కువైట్ వెళ్లడమే సరైన మార్గమని అతడు నమ్మాడు. ఎలాగోలా వీసా సంపాదించి, కువైట్ చేరి అక్కడ తగిన పని ఏదీ దొరకకపోవడంతో భవన నిర్మాణ కూలీగా పనిచేయసాగాడు.

కువైట్ ఎండలు మండిపోయే ఎడారి దేశం. కానీ రవికి ఆ వేడి తగలలేదు, ఎందుకంటే అతని మనసులో తన కుటుంబాన్ని బాగు చేయాలనే కసి, పట్టుదల ఉన్నాయి. అందుకే పగలురాత్రి కష్టపడేవాడు. రవి చూడ్డానికి అందంగా, చురుగ్గా ఉండటంతో తోటి కూలీలు కూడా అతనంటే ఇష్టపడేవారు.

అక్కడే అతనికి రజని పరిచయమైంది. ఆమె కూడా అదే కంపెనీలో కాల్ ఆపరేటర్ గా ఉండేది. వారి పరిచయం కాస్తా ప్రేమగా మారింది.

"రవీ, మనం పెళ్లి చేసుకున్నాక ఇక్కడే సెటిల్ అయిపోదాం. నువ్వు బాగా సంపాదిస్తున్నావుగా" అని రజని అంటే, రవి తన భవిష్యత్తు ఆమెతోనే అని నమ్మి మురిసిపోయేవాడు.

కానీ జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు. అనూహ్యమైన మలుపులు తిరుగుతూ వుంటుంది. ఒక సంవత్సరం గడిచింది. ఇంటికి డబ్బులు పంపి అప్పులు తీర్చేసాడు. ఇక కుదుటపడుతున్నాం అనుకునేలోపల ఒకరోజు మధ్యాహ్నం,

ఐదో అంతస్తులో నిచ్చెన మీద నిలబడి సిమెంట్ పూస్తున్న రవికి ఒక్కసారిగా కళ్ళు తిరిగాయి. క్షణంలో కాలు జారింది. గాలిలో తేలుతూ కింద పడిపోతున్నప్పుడు అతనికి కళ్ళముందు అమ్మ ముఖం, రజని నవ్వు మాత్రమే గుర్తొచ్చాయి.

భయంకరమైన శబ్దం.. ఆపై నిశ్శబ్దం. ఘోరం జరిగిపోయియింది.

నేలపై రక్తపు మడుగులో అచేతనంగా శరీరం.

రవి కళ్ళు తెరిచేసరికి తను కువైట్‌లోని ప్రసిద్ధిచెందిన అల్ సబ హాస్పిటల్ బెడ్ మీద ఉన్నాడు. ఒళ్ళంతా నొప్పులు. వింతైన మత్తుతో వళ్ళు. కదలాలని ప్రయత్నించాడు కానీ నడుము కింద భాగం అసలు స్పర్శ లేకుండా ఉంది.

డాక్టర్లు వెన్నెముక దెబ్బతిన్నదని చెప్పారు. రెండు కాళ్ళూ విరిగిపోయాయి. ఇక నడవడం దాదాపు అసాధ్యం.

అందమైన రవి రూపం అష్టావక్రలా మారింది.

హాస్పిటల్ బెడ్ మీద రవి గడిపిన ఆరు నెలలు నరకప్రాయం. రోజుకో రకమైన సర్జరీ చేస్తుంటే అతడి శరీరం అల్లాడిపోయేది. ఆ సమయంలో రజని అప్పుడప్పుడు వచ్చి వెళ్లేది. కానీ ఆమెలో పాత ప్రేమ కనిపించడం లేదు. ఆమె ముఖంలో విసుగు, అసహ్యం కనిపిస్తోంది. ఒకరోజు రవి ధైర్యం చేసి అడిగాడు

"రజనీ, డాక్టర్లు ఫిజియోథెరపీ చేస్తే నడవచ్చని అంటున్నారు. నాకు తోడుగా ఉంటావు కదా?"

వెంటనే రజని ముఖంలో రంగులు మారాయి.

ఎంతో కఠినంగా "నువ్వు నడుస్తావా? అది సంభవమా..

అబద్ధాలు చెప్పకు రవీ. నీ కాళ్ళు రెండూ చచ్చుబడిపోయాయి. నిన్ను చూసుకుంటూ నా జీవితాన్ని నాశనం చేసుకోలేను. ఒక కుంటివాడిని పెళ్లి చేసుకుని నేను ఏం చేయాలి? డబ్బు ఉన్నప్పుడు నిన్ను ప్రేమించాను, ఇప్పుడు నువ్వు తలకు మించిన భారానివి. నన్ను మర్చిపో" అని ఒక్క మాటలో చెప్పేసి వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది.

రవి కళ్ళల్లో నీళ్లు ఆగలేదు. తనను తానే అసహ్యించుకున్నాడు.

బతకడం ఎందుకని రోదించాడు. నిజమే... తనిప్పుడు అవిటివాడు, అందవికారి. సంపాదించలేనివాడు. రజనిని తోడుగా వుండమని అడగడం భావ్యం కాదు. న్యాయమూ కాదు. కానీ ఆమె ప్రేమను మరవడం ఎలా? చివరికి రజని లేని జీవితం శూన్యం అనిపించి చనిపోవాలని నిశ్చయించుకున్నాడు.

కానీ ఎలా చావాలో అర్థం కాలేదు. అక్కడే వున్న బ్లేడు తీసుకుని మణికట్టుపై కోసుకోబోయాడు. ఇంతలో సుడిగాలిలా దూసుకువచ్చింది ఆ వార్డులో పనిచేసే కేరళ నర్స్ మేరీ.

ఆమె ఎంతో సౌమ్యురాలు. రజని పరుషంగా అన్న మాటలన్నీ మేరీ విన్నది. వెంటనే రవి చేతిలోని బ్లేడును తీసుకుని దూరంగా విసిరేసింది. దగ్గరికి వెళ్లి తల నిమిరింది.

"రవీ, కళ్ళు తుడుచుకో, ఆమె వెళ్ళిపోయింది నీకు కాళ్ళు లేవని కాదు, ఆమెకు నీ మీద నిజమైన ప్రేమ లేక. మనిషికి కాళ్ళు ముఖ్యం కాదు, గుండె ధైర్యం ముఖ్యం అంది మలయాళం కలిసిన తెలుగులో.

రవి కాస్త తెప్పరిల్లాడు. అప్పటినుండి మేరీ రవిని సొంత మనిషిలా బాధ్యతగా చూసుకోసాగింది. డ్యూటీ అయిపోయినా కూడా రవి దగ్గర కూర్చుని కబుర్లు చెప్పేది. అతనికి నడక మీద నమ్మకం కలిగించేందుకు రోజూ కసరత్తులు చేయించేది.

రవి తల్లిదండ్రులకు కూడా ఇంటి ఖర్చులకు ఆమె డబ్బు పంపేది. మేరీలాంటి మంచి హృదయమున్నవాళ్ళు భూమిపైన వుంటారా, ఆమె తనకోసం పుట్టిన దేవత కాదుకదా అని కృతజ్ఞతతో రవి ఆమెకు దండం పెట్టేవాడు.

మేరీకి భర్త చనిపోయాడని, ఒక కొడుకు కొచ్చిలో అమ్మనాన్నల దగ్గర వున్నాడని తను అందుకే కువైట్ వచ్చి నర్స్ గా చేస్తోందని తన కథను అతడికి చెప్పింది.

ఒక సంవత్సరం భారంగా గడిచింది. రవి మెల్లమెల్లగా చక్రాల కుర్చీ సాయంతో కదలడం మొదలుపెట్టాడు. మేరీ చూపించిన ఆదరణ రవికి కొత్త ప్రాణం పోసింది. ఆమె కేవలం నర్సుగా మాత్రమే కాదు, ఒక ఆరాధ్య దైవంలా కనిపించింది.

ఒక సాయంత్రం హాస్పిటల్ గార్డెన్‌లో కూర్చున్నప్పుడు రవి అడిగాడు, "మేరీ నా కోసం ఎందుకు ఇంత కష్టపడుతున్నావు? నేనొక అపరిచితుడిని, పైగా నడవలేని వాడిని కూడా.."

మేరీ నవ్వింది. "నీ కళ్ళలో నిజాయితీ ఉంది రవీ. మనుషులంటే అవసరానికి వాడుకుని వదిలేసేవాళ్లు కాదు. నీ వైకల్యం నీ శరీరానికే కానీ మనసుకి కాదు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నీకు తోడుగా నీ నీడగా ఉండాలనుకుంటున్నాను అంది."

రవి ఆశ్చర్యపోయాడు. ప్రపంచం తనని వదిలేసినప్పుడు, అవిటివాడిగా మారి దు:ఖిస్తున్నప్పుడు ఏ సంబంధం లేని ఒక కేరళ అమ్మాయి తనను గుండెల్లో పెట్టుకోవడం అతనికి నమ్మశక్యం కాలేదు.

మరో ఆరునెలల తర్వాత రవి తన కాళ్ళ మీద తను కర్ర సాయంతో నిలబడగలిగాడు. మేరీ ప్రేమ అతనికి మందుల కన్నా బాగా పనిచేసింది.

కువైట్ ప్రభుత్వం అతడిని పరిశీలించి అతడికి జరిగిన నష్టానికి కోటిరూపాయలు నష్టపరిహారం కింద ఇచ్చింది. ఆ డబ్బు అతడిలో ఆత్మ విశ్వాసాన్ని పెంచింది.

మేరీకి ఈ విషయం చెప్పాడు.వారిద్దరూ ఇండియాకు వచ్చి పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

కువైట్ విమానాశ్రయంలో రవి వీల్‌చైర్ వదిలి, మేరీ చేతిని పట్టుకుని ఒక్కో అడుగు వేస్తుంటే, ఇమిగ్రేషన్ కౌంటర్ వద్ద రజని కనిపించింది. అక్కడ ఏదో పెద్ద గొడవ జరుగుతోంది.

అక్కడ రజని ఒక అరబ్ వ్యక్తితోనూ, మరో ఏజెంట్‌తోనూ గట్టిగా వాదిస్తోంది. ఆమె ముఖంలో ఒకప్పటి గర్వం లేదు, కేవలం భయం, ఆవేదన కనిపిస్తున్నాయి.

ఆమె నమ్మిన వ్యక్తి ఆమెను మోసం చేసి, ఆమె సంపాదించిన డబ్బునంతా తీసుకుని పారిపోయాడని ఆమె మాటలనుబట్టి అర్థమవుతోంది. "నేను నీ కోసం నా ప్రియుడినే వదిలేశాను, ఇప్పుడు నన్ను ఇలా రోడ్డున పడేస్తావా?" అని ఆమె ఏడుస్తూ అరుస్తోంది.

అప్పుడే రవి ఆమెను దాటుకుంటూ వెళ్లాడు. రవిని చూసిన రజని ఒక్క క్షణం షాక్‌కు గురైంది. విరిగిపోయిన కాళ్లతో, వీల్‌చైర్‌కే పరిమితం అవుతాడనుకున్న రవి, ఒక అందమైన కేరళ అమ్మాయి చేయి పట్టుకుని ధీమాగా నడవడమనేది ఆమె నమ్మలేకపోయింది. ఆమె కళ్లల్లో పశ్చాత్తాపం కనిపించింది, కానీ రవి ఆమె వైపు ఒక్కసారి కూడా కోపంగా చూడలేదు. ఆమెను దాటి వెళ్తున్నప్పుడు రవి ముఖంలో ఒక ప్రశాంతమైన చిరునవ్వు మాత్రమే ఉంది. అది ఆమెకు అతిపెద్ద శిక్షగా మారింది.

తనెంత తప్పు చేసిందో రజనికి అర్థమయింది.

ఎయిర్పోర్టులో కలతచెందిన మనసుతో కళ్లల్లో నీళ్లతో "మేరీ, నీ దయకు ధన్యవాదాలు, నువ్వు లేకపోతే ఏమయిపోయేవాడినో" అంటూ ఆమె చెయ్యి పట్టుకున్నాడు రవి.

మేరీ రవి పక్కన కూర్చుని, అతని చేతిని ఆత్మీయంగా పట్టుకుని "దయ, జాలి కాదు రవీ, అది గౌరవం. ఐదో అంతస్తు నుండి పడి కూడా ప్రాణాలతో బయటపడ్డావంటే దేవుడు నిన్ను దేనికోసమో ప్రాణంతో ఉంచాడని అర్థం. మనిషి విలువ కాళ్లలో ఉండదు, చేసే పనిలో ఉంటుంది."

"కానీ నేను మళ్ళీ ఆ సిమెంట్ బస్తాలు మోయలేను కదా? ఏ పని చేయలేని వాడిని నీకు భారం అవుతానేమో.."

మేరీ చిరునవ్వుతో "నువ్వు బస్తాలు మోయక్కర్లేదు రవీ. నీకు తెలివితేటలు ఉన్నాయి. మనం కేరళ వెళ్దాం. మా నాన్నకు చిన్న తోట ఉంది, అక్కడ మనం ఒక చిన్న వ్యాపారం చేసుకుందాం. నీకు తోడుగా నేనుంటాను, నాకు నీడగా నువ్వు ఉండు. జీవితం అంటే కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదు, ఇద్దరు వ్యక్తులు ఒకరికొకరు ఇచ్చే ధైర్యం.

నన్ను ఇంతలా అర్థం చేసుకున్నందుకు ఏం చెప్పాలో తెలియడం లేదు మేరీ. నా జీవితమంతా చీకటి అనుకున్నాను, కానీ నువ్వు ఒక దీపంలా వచ్చావు.

మేరీ ఆ దీపాన్ని ఆరిపోకుండా చూసుకోవడం ఇక నీ బాధ్యత" అన్నాడు రవి.

"రేపటి నుండి ఫిజియోథెరపీలో నువ్వు అస్సలు తగ్గకూడదు. నేను నిన్ను మళ్ళీ నడిపించాలి, అది నా ఆశయం." అంది మేరీ.

ఆ మాటలు విన్న రవికి కన్నీళ్లు ఆగలేదు. కానీ అవి బాధతో వచ్చినవి కావు, తనను ప్రాణం కంటే మిన్నగా ప్రేమించే వ్యక్తి దొరికినందుకు దొరలిన సంతోష భాష్పాలు.

అక్కడ రజనిని చూసి రవికి కోపం రాలేదు, జాలి వేసింది. ఎందుకంటే ఆమె అందాన్ని చూసి ప్రేమించింది, కానీ రవికి మాత్రం ఆత్మను ప్రేమించే మేరీ దొరికింది.

కష్టాలు మనిషిని కుంగదీస్తాయి, కానీ అదే సమయంలో మనకు ఎవరు నిజమైన వారో, కానివారో చూపిస్తాయి.

రవి కాళ్ళు కోల్పోయినా, అంతకంటే గొప్పదైన నిజమైన ప్రేమను పొందాడు.

మేరీ ప్రేమ రవికి పునర్జన్మను ఇచ్చింది. అందం చూసి ఆశపడిన రజని, అవసరం తీరాక భారమని వదిలేసింది..

కష్టం వస్తే కరిగిపోయేది ప్రేమ కాదని, కఠినంగా నవ్వి మరీ చాటి చెప్పింది. కానీ, గాయపడిన గుండెకు మందుగా మారింది మేరీ.

కదిలే కాలానికి ధైర్యంగా నిలిచింది. కాళ్ళు లేవని లోకం వెక్కిరిస్తుంటే, తనే ఒక నడకై, తోడుగా నడిపించింది. ఆమె రవికి ఒక ప్రాణ వాయువు, అతని చీకటి జీవితంలో ఉదయించిన సూర్యుడు..

స్వార్థం గెలిచిన చోట ఓటమి ఎదురవ్వచ్చు, కానీ త్యాగం తోడైతే.. మనిషికి మళ్ళీ పునర్జన్మ దొరుకుతుందని మేరీ నిరూపించింది. ఇప్పుడు ఆమె కంటికి రవి తడబడుతూ అడుగులు వేసే చంటిపిల్లాడు.

(మరోకథ వచ్చేనెల)

Post your comments